

23న ప్రకృతి వ్యవసాయంపై సదస్సు

ప్రజాశక్తి - అంబాజీపేట

కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రంలో ఈనెల 23న కొబ్బరి, అంతర పంటలలో ప్రకృతి వ్యవసాయంపై సదస్సు ఏర్పాటు చేసినట్లు ప్రధాన శాస్త్రవేత్త అధిపతి డాక్టర్ ఎన్‌.బి.వి.చలపతిరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అఖిల భారత వన్య తోటల సమన్వయ పథకం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రవి భట్, సిపిసి ఆర్ఐ, కాసర్ గాడ్‌లు ఈ సదస్సును సందర్శిస్తారన్నారు. కొబ్బరిలో ప్రకృతి వ్యవసాయం, కొబ్బరిలో పుప్పొడి పెంచెం ఎదుగుదల, కొబ్బరి చెట్ల మొవ్వు పరిశీలించుట, నిర్వహిస్తున్న పరిశోధనలు సమీక్షిస్తారని అన్నారు. ఈ సదస్సుకు రైతులు, ఉద్యాన అధికారులు, అధిక సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చలపతిరావు కోరారు.

సమస్యల సుడిలో సహకార ఉద్యోగులు

పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సహకార సంఘ ఉద్యోగులు (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి - అమలాపురం

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో పని చేస్తున్న ఉద్యోగులు ఉద్యోగ భద్రత లేక సమస్యలు సుడిలో కొట్టుమిట్టాడుతున్నారు. సహకార సంఘ ఉద్యోగులకు జిఒ నెంబరు 36 ప్రకారం జీతాలు చెల్లించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల చట్టాన్ని సవరిస్తూ నిర్ణయం తీసుకున్నదని ఈ నిర్ణయంతో సహకార రంగం మనుగడ దెబ్బ తీసే విధంగా ఉన్నాయని సహకార సంఘ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఏసియస్‌ల్లో 50 శాతం వాటాలను ప్రయివేటు వ్యక్తులకు, కంపెనీలకు ఇస్తూ 1964 చట్టానికి చేసిన సవరణలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.జిఒ 36, జిఒ. 90 ప్రకారం వేతనాలను ఇతర బెనిఫిట్లను అమలు చేయాలని ఏప్రిల్ 1 2019 నాటి వేతన సవరణ వెంటనే చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్యోగులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలు చేస్తామని 2019 మార్చి 14 తేదీన జిఒ 36ను విడుదల చేసిందని గత 5 సంవత్సరాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నప్పటికి ఈ జిఒ అమలుకు నోచుకోలేదు. జిఒ ఇచ్చిన ప్రభుత్వమే వచ్చిందని మా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంతో ఆశపడి ప్రజా ప్రతినిధులకు అధికారులకు అనేక విజ్ఞప్తులు చేసామని సహకార శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు వెంటనే మీ హెచ్ఆర్ పాలసీ, తదితర సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని సహకార సంఘ ఉద్యోగులు అన్నారు. అలాగే సహకార శాఖ కమిషనర్ ఎ.బాబు కంప్యూటరీకరణలో భాగంగా డిసిటి అఫ్లోర్ ప్రీ మైగ్రేషన్ వర్క్ పూర్తి చేయండి. వెంటనే మీ హెచ్ఆర్ పాలసీ, మిగిలిన సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఏపి రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలపై నేటికీ ఎవరు స్పందించలేదని వారు వాపోతున్నారు.జిఒ 36 లో పేర్కొన్న ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి 62 సంవత్సరాలు ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలని పిఏసియస్‌లకు ఇన్ కమ్ ట్యాక్స్ పూర్తిగా మినహాయింపును ఇవ్వాలని, టిడియస్‌లో వున్న ఇబ్బందులను తొలగించాల ఇప్పటికే బ్యాంకులు వసూలు చేసిన టిడియస్ మొత్తాలను తిరిగి సంఘాలకు జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. సహకార శాఖ కమిషనర్ రిజిస్ట్రార్ వారు ఇచ్చిన ఆదేశాల ప్రకారం సంఘాల షేర్ ధనంపై 5 శాతం డివిడెండ్ లేదా వడ్డీ తక్షణమే చెల్లించాలన్నారు. 2011-2013 మధ్య కాలంలో రైతులకు ఇచ్చిన 6శాతం, 4శాతం వడ్డీ రాయితీ ఇప్పుడు సహకార సంఘాల పేర కొన్ని జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు అప్పుగా వ్రాయడం చట్ట బద్ధత కాదని ఈ ప్రక్రియను బ్యాంకులు వెంటనే ఉపసం హరించుకుని రివర్స్ ఎంట్రీలు పాస్ చేయాలని నాయకులు కోరారు.

జిఒ 36ను అమలు చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెంబర్ 36 అమలుచేయాలి. సహకార సంఘం ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదు. సహకార సంఘాల్లో ఖాళీలను భర్తీ చేయాలి. సిఇఒ ఖాళీలను కింది సిబ్బందితే నియమించాలి. సహకార సంఘాలలో పనిచేయుచున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలి. అలాగే సిబ్బంది ఉద్యోగ విరమణ 62 సంవత్సరాలకు పెంచాలి. ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి.

- పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి)

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



రాత్రనక పగలనక ఆర్‌సియస్ వారు ఇచ్చిన టార్గెట్‌ను మాకు శిక్షణ ఇవ్వక పోయినా పూర్తి చేశాం. తమ డిమాండ్ లు పరిష్కారం అయ్యే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించాం. మా న్యాయ మైన డిమాండ్లు పరిష్కరించాలి. గ్రామీణ స్థాయిలో రైతులకు సేవలు అందించే మాకు ప్రభుత్వం, అధికారులు న్యాయం చేయాలని కోరుతున్నాం.

-యర్రంశెట్టి రామచంద్రరావు, జిల్లా 'సహకార'ఉద్యోగుల సంఘం అధ్యక్షులు

బెనిఫిట్లు అమలు చేయాలి



జిఒ నెం.36, జిఒ.90 ప్రకారం వేతనాలను ఇతర బెనిఫిట్లను వెంటనే అమలు చేయాలి. 2016 ఏప్రిల్ 1వ తేదీన నుంచి మొనటరీ బెనిఫిట్స్ చెల్లించాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాట్యుటీ చట్ట ప్రకారం అమలు పరచాలి. రాష్ట్ర సహకార బ్యాంకు జిల్లా కేంద్ర బ్యాంకులు కలిపి డిస్ట్రిక్ట్ లెవెల్ సపోర్టుఫండ్ ఏర్పాటు చేయాలి. 62 సంవత్సరములకు ఉద్యోగ విరమణ వయస్సు పెంపుకు ఆదేశాలు విడుదల చేయాలి.

-పెండే సత్యనారాయణ, జిల్లా 'సహకార'ఉద్యోగుల సంఘం కార్యదర్శి

23న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - ఆలమూరు

ఈ నెల 23న విద్యుత్ సబ్ డివిజన్ మండపేట పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కారానికి ఈ 23న ప్రజా పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు సిజిఆర్ఎఫ్ కార్యదర్శి ఎస్.మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండపేటలో జరిగే వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో విద్యుత్ సమస్యలు ఉన్నవారు వచ్చి నేరుగా పరిష్కరించు కోవాలని కోరారు. విద్యుత్ శాఖకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండపేట డివిజన్ పరిధిలో ఆలమూరు, మండపేట రూరల్, మండపేట టౌన్ రాయవరం, ద్వారపూడి సబ్‌స్టేషన్లు ఉన్నాయన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కార వేదికకు సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ డి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎన్ఎం.మణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ హాజరు కానున్నారని ఆయన తెలిపారు.

ఘనంగా క్రీడా పోటీలు ప్రారంభం



ప్రారంభిస్తున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక జిఎంసి బాలయోగి స్టేడియం నందు బుధవారం కోనసీమ క్రీడోత్సవాలు ఆటలతో ఆరోగ్యం పేరిట జిల్లా స్థాయి విద్యార్థుల క్రీడా పోటీలను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాభ్యాసంతో పాటుగా క్రీడలలోను క్రీడా స్ఫూర్తి, పోటీతత్వంతో క్రీడా ప్రతిభను చాటుతూ కోనసీమ జిల్లా పేరు ప్రఖ్యాతులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఇనుమడింప జేయాలని క్రీడాకారులకు పిలుపు నిచ్చారు. క్రీడలు మానసిక ఉల్లాసానికే కాదని జీవితాల్లో ఉన్నత స్థానాలు చేరడానికి దోహదపడతాయన్నారు. యువతలో ఉన్న క్రీడాప్రతిభను వెలికితీయడానికి జిల్లా స్థాయిలో యువ క్రీడాకారులు క్రీడా పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు వెళ్లేలా క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు ప్రోత్స హించాలన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సర్వ సాధారణమని, క్రీడాస్ఫూర్తిని అలవరుచుకొని రాణించడం వల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో పోటీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ రెండు రోజులు ఈయొక్క ఈవెంట్లలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ విజేతలుగా నిలవాలని శుభాకాంక్షలు తెలిపారు. తొలుతగా జ్యోతి ప్రజ్వలన గావించి జాతీయ పథకాన్ని ఆవిష్కరించి విద్యార్థినీ విద్యార్థుల విన్యాసాలను ఆయన తిలకించారు. జెసి టి.నిషాంతి మాట్లాడుతూ కలెక్టర్ వారి ప్రత్యేక చొరవతో కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. 22 మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న చక్కటి వేదికను కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. శాసన మండలి సభ్యుడు కె.సూర్య నారా యణరావు ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో డిఇఒ షేక్ సలీం బాషా, ఆర్‌డిఒ కె.మాధవి, జిల్లా క్రీడాభివద్ధి అధికారి ముఖ్య శిక్షకులు సురేష్ కుమార్, డిఎస్ఒ జివిఎస్.సుబ్రహ్మణ్యం, ఉప విద్యాశాఖ అధికారులు పి.సూర్యప్రకాష్, వివిధ ఈవెంట్లు ఇన్‌ఛార్జిలు, వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కెవిపిఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్ కుమార్, ఎంఎల్‌సి ఐవి

ప్రజాశక్తి - అమలాపురం

కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కమిటీ ముద్రించిన డైరీని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్, పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు బుధవారం కలెక్టర్‌లో ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ డైరీని ను ఆవిష్కరించడం సంతోషదాయకమని అన్నారు. డైరీలో విలువైన సమాచారాన్ని పొందు పరిచిన కెవిపిఎస్ రాష్ట్ర కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. ఎంఎల్‌సి ఐవి మాట్లాడుతూ కెవిపిఎస్ ఆవిర్భావం 1998లో జరిగిందన్నారు. ఆ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బివి.రాఘవులు నాయకత్వంలో సామాజిక సమస్యలపై సైకిల్ యాత్ర ను నిర్వహించారన్నారు. అప్పట్లో నేను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యుటిఎఫ్ అధ్యక్షుడిగా ఉండి తెలంగాణ ప్రాంతంలో జరిగినటు వంటి సైకిల్ యాత్రలో, చాలా జిల్లాల్లో సైకిల్ యాత్రలో పాల్గొనడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డైరీ ఆవిష్కరణలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ శెట్టిబతుల తులసిరావు, లీగల్ అడ్వజర్ యాలంగి సత్యనారాయణ, అల్లవరం మండల కన్వీనర్ గెడ్డం విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




బుధవారం మార్కెట్లో తొలగించిన ఆక్రమణ లు

ద్రాక్షారామ మార్కెట్లో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ మార్కెట్లో ఆక్రమణలను అధికారులు తొలగించారు. దీంతో ఆక్రమణ లకు గురైన ద్రాక్షారామ సంత మార్కెట్ కు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎన్నో ఏళ్లుగా వ్యాపారులు వివిధ రకాల వ్యాపారాల పేరుతో మొత్తం మార్కెట్ అస్తవ్యస్తంగా ఆక్రమించి వాహనాలు రాకుండా చేస్తున్నారు. దీంతో పాటుగా సంతకం వచ్చే వినియోగదారులకు ఇబ్బంది గా మారింది. దీంతోపాటుగా ఇక్కడ పంట కాలువ, డ్రెయినేజీలను సైతం ఆక్రమణ దారులు పూర్తిగా ఆక్రమించి సోమవారం సంత రోజున ఇష్టం వచ్చిన విధంగా చెత్త వేయడంతో తీవ్ర సమస్యలు వివాదాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ పాలకవర్గ సభ్యులు కార్యదర్శి చర్చించుకుని పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఆ క్రమంలో తొలగించేందుకు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో బుధవారం పలు ఆక్రమణలు తొలగించారు. ఆక్రమణలో తొలగించడంతో ద్రాక్షారామ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కార్టూ'నిజం'



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



నగదు, నిత్యావసరాలు అందిస్తున్న వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - అల్లవరం

అగ్నిప్రమాద బాధితులకు బుధవారం పలువురు ఆర్థిక సాయం నిత్యా వసరాలు అందజేశారు. మండలంలోని దేవగుప్తం గ్రామం చెందిన బుంగా చిట్టిబాబు తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ ఘటనలో వారు సర్వం కోల్పోయి నిరాశ్రల య్యారు. చిట్టిబాబు కుటుంబంలో ఇద్దరు వికలాంగులైన పిల్లలు ఉన్నారు. జిల్లా కోనసీమ దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు వంటెద్దు వెంకయ్య నాయుడు, అధ్యక్షులు నాగవరపు పరశురాముడు ఆధ్వర్యంలో బాధితులకు ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందజేశారు. వెంకయ్యనాయుడు రూ.ఐదు వేల నగదు, నిత్యావసర వస్తువులు, డి.రావులపాలెంకు చెందిన బళ్ల అర్జునరావు రూ.10వేల సాయం అందించారు. అగ్ని ప్రమావ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని వెంకన్న నాయుడు కోరారు. ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ సాధనాల వెంకట్రావు, ముత్తాబత్తుల రాంబాబు, పోతుల నాగరాజు, బ్యాంకు వీరబాబు, బొంతు శ్రీనివాస్, సాధనాల విగ్నేశ్వరరావు, పితాని సత్య ప్రసాద్, తిక్క బాబీ పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షలో విజేతల వివరాలు వెల్లడి



వివరాలును తెలియజేస్తున్న డివివి.సత్యనారాయణ తదితరులు

ప్రజాశక్తి - మామిడికుదురు

జాతీయగణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 2024 డిసెంబర్ 22న నగరం సాయిదీప్తి ఐఐటి, మెడికల్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో విజేతల వివరాలను బుధవారం దీప్తి విద్యా సంస్థల ఛైర్మన్ డివివి.సత్యనారాయణ విడుదల చేశారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఉన్నత పాఠశాలల విభాగంలో నిర్వహించిన పరీక్షకు 300 మంది హాజరు కాగా 268 మంది క్వాలిఫై అయ్యారన్నారు . ప్రయివేట్ పాఠశాలల విభాగంలో రాజోలు అక్షర పాఠశాల విద్యార్థి కొత్తపల్లి శంకర్ 50/50 మార్కులు సాధించి జిల్లా మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడని చెప్పారు. మామిడికుదురు దీప్తి పాఠశాల విద్యార్థిని బళ్ళ సాయి కార్తీక 48/50 మార్కులతో ద్వితీయ స్థానం, రాజోలు చిల్డ్రన్స్ పాఠశాల విద్యార్థిని చొల్లంగి వర్షిత 36/50 మార్కులతో తృతీయ స్థానం సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో పి.గన్నవరం హై స్కూల్ విద్యార్థి గంటా స్వాతి 36/50తో ప్రథమ స్థానం, పైడిపర్తి విజయ శివాని (32/50 కాట్రేనిపాడు హై స్కూల్), ద్వితీయ స్థానం, వేగి హర్షిత (31/50 మామిడికుదురు హైస్కూల్), మొల్లా ఫాతిమా (31/50 పి. గన్నవరం హైస్కూల్) తృతీయ స్థానం సాధించార న్నారు. అలాగే మిగిలిన మార్కులు వివరాలను త్వరలో పాఠశాలల వారీగా అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సాయిదీప్తి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జక్కంపూడి శివప్రసాద్, అధ్యాపకులు అడబాల ఈశ్వరరావు, కోడూరి వెంకటేష్, కడలి మురళి శ్రీనివాస్, పొన్నమండ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కరక్కాయపేట రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



కరక్కాయ పేట బోదిగట్టు రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని కామనగరువు పంచాయతీ పరిధిలోని ఫ్లయ్ ఓవర్ బిడ్జి కింద నుంచి కరక్కాయ పేట వెళ్లే పంట బోది గట్టు రోడ్డు పనులను సర్పంచ్ నక్క అరుణ కుమారి ప్రారంభిం చారు. సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారులు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. బైపాస్ నుంచి కరక్కాయ పేట మీదుగా ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జి కిందకు రావడానికి ఈ రోడ్డు ఆధారం. రోడ్డు ఇరుకు అవడంతో పంచాయతీ నిధులను ఉపయోగించి గ్రావెల్‌తో విస్తరణ పనులు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. అలాగే అప్పన్నపేట రెడ్డిపల్లి రోడ్డు పనులకు పంచాయతీ నిధులు ఉపయోగిస్తు న్నామని అన్నారు. 14వ వార్డు సభ్యులు కాట్రు కృష్ణతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పనులు పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్ ను సర్పంచ్ ఆదేశించారు.

ఆసుపత్రుల అభివృద్ధికి కృషి: ఎంఎల్‌ఎ బండారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రజారోగ్య దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని యోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆసుపత్రిలో ఉన్న రోగుల వార్డులను, ప్రసూతి, మార్చురీ భవనాలను, డ్రెయినేజీలు తీరు పరిశీలించి, పలు వివరాలను ఆసుపత్రి సిబ్బంది నుంచి ఆయన సేకరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా ప్రతి అంశాన్ని చర్చించానని అన్నారు. ఇందులో వైద్యులను ఇబ్బందులకు గురిచేసే అంశాలు ఉన్నాయన్నారు. స్థానికులు కొందరు మద్యం సేవించి ఆసుపత్రి సిబ్బందిపై దౌర్జన్యం చేసిన సంఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇటువంటివి పునరావృతం కాకూడదన్నారు. స్థానిక ఎస్ఐ ఎం.అశోక్ కు అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ ఏడుగురు వైద్యులకు గాను ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉండటంతో వైద్య సేవలు రోగులకు తక్కువగా అందుతున్నాయని వైద్యులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ గైనిక్ డాక్టర్ ఈ ఆస్పత్రికి ఎంతో అవసరమని వెంటనే తీసుకోవడం జరుగుతుందని, అలాగే ఇతర సంబంధిత వైద్యులను భర్తీ చేస్తామన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో మాట్లాడి వేగంగా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ ఎ.రాజుకు ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు వర్షం వస్తే నీటి నిల్వలు ఉండకుండా వెంటనే మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆసుపత్రి కమిటీ సభ్యులు, వైద్యులు సమస్యలపై చర్చించుకుని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.రాజు, ఎస్ఐ ఎం.అశోక్, ఆసుపత్రి సూపరిండెండెంట్ గోపిరామ్ పిల్లి, కూటమి నాయకులు ఈదల సత్తిబాబు, ఈదల నల్ల బాబు, వంటిపల్లి సతీష్, సూరపురెడ్డి సత్య, సర్పంచులు నాతి లావణ్య కుమార్ రాజా, సంగీత సుభాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో కుష్టు వ్యాధిపై సర్వే



గంగలకుర్రు అగ్రహారంలో సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది



పాశర్లపూడిలో ఇంటింటా సర్వే

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల బుధవారం కుష్టు వ్యాధి సర్వేలు నిర్వహించారు. ఈసర్వేలను అధికారులు పరిశీలించారు. కుష్టు నిర్మూలనపై అధికారులకు అవగాహన కల్పించారు.

అంబాజీపేట: అంబాజీపేట పిహెచ్‌సి పరిధిలో జరిగే కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వే క్షేత్రస్థాయిలో మాచవరం-2 మందానగర్, మాచవరం-1 కముజువారిపేటలలో నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ సిహెచ్‌వి.భరత్‌లక్ష్మి బుధవారం పరిశీలించారు. అనంతరం గంగలకుర్రు అగ్రహారం, దంగేటివారి పాలెంలో అంగన్‌వాడీ సెంటర్ 23 నందు సందర్శించి పిల్లల అనుమానాస్పద మచ్చలను పరిశీలించారు. అడిషనల్ డిఎంహెచ్‌ఒతో పాటు పిహెచ్‌సి సిహెచ్‌ఒ బి.అప్పారావు ఇప్పటి వరకు ఏడు కేసులను పరీక్షించామన్నారు. ఈ సర్వేలో ఎంపిహెచ్‌ఎస్ ఎన్.మధుబాబు, ఎంపిహెచ్‌ఎ డి.నాగేశ్వరరావు, ఎఎన్ఎం, ఎంఎల్ హెచ్‌పి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మామిడికుదురు: కుష్టు వ్యాది లక్షణాలు ఉంటే వైద్య సిబ్బందికి సహకరించాలని హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల సూర్యనారాయణ సూచించారు పాశర్లపూడిలో బుధవారం ఇంటింటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు .

కపిలేశ్వరపురం: మండలంలోని అచ్యుతాపురం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అచ్యు తాపురం పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ రెడ్డి సుజాత అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో వైద్యాధికారాణి డాక్టర్ విజయ దీపిక 'స్పర్శ - కుష్టు వ్యాధి పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయదీపిక మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఫిబ్రవరి 8వ తేదీ వరకు గ్రామాల్లో ఇంటింటా వ్యాధిగ్రస్తులపై సర్వే నిర్వహించి సర్పంచ్ ల ఆధ్వర్యంలో గ్రామ సభను ఏర్పాటు చేసి పలు అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ రెడ్డి ప్రసాద్, వల్లూరి చంద్రశేఖర్, డిపిఎంఒ పి.వెంకటేశ్వరరావు, ఎంపిహెచ్ఇఒ సిహెచ్. బాలకష్ణ, ఎఎన్ఎంలు, సచివాలయ ఉద్యోగులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అచ్యుతాపురం లో కుష్టు వ్యాధి పై అవగాహనా సదస్సు

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చినగాడవిల్లిలో పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేస్తున్న సర్పంచ్ బాబ్జి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బద్రి బాబ్జి కోరారు. చినగాడవిల్లిలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ బద్రి బాబ్జి ప్రారంభించి పశువులకు రోగ నిరోధక మందులు వేశారు. పశు వైద్య శిబిరంలో ఉప్పలగుప్తం ఏరియా పశువుల ఆసుపత్రి సహాయ సంచాలకులు డాక్టర్ బి.నాగేశ్వరరావు పశు వులకు వైద్య పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు వేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల అందజేశారు. శిబిరంలో 22 మందికి చెందిన 63 పశువులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దూనబోయిన వెంకటేశ్వరరావు,గుత్తుల గణేష్, నూకల రాజా, జెవిఒ, డాక్టర్ కెవి.రామారావు, సహాయకులు జె.కిషోర్, జి.వెంకటరత్నం, పాడి రైతులు పాల్గొన్నారు.

కొబ్బరి తోటల పునరుద్ధరణకు చర్యలు


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

ప్రజాశక్తి - అమలాపురం

కొబ్బరి తోటలు పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా కొబ్బరి అభివృద్ధి బోర్డు నిధులతో ముదురు, కాయలు కాయని, రోగాల బారిన పడిన కొబ్బరి తోటలు స్థానే పునరుద్ధరణ కొరకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఉద్యాన అధికారులను ఆదేశించారు. కొబ్బరి తోటల పునరుద్ధరణపై నియమింపబడిన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన స్థానిక కలెక్టరేట్ నందు బుధవా రం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం అమల్లో భాగంగా పునరు ద్ధణ పథకం జిల్లా స్థాయి కమిటీ క్షేత్ర స్థాయి పరిశీలన పూర్తి చేసిందని తెలిపారు. జిల్లాలో ఉ ద్యాన శాఖ ద్వారా అమలు కాబడుతున్న కొబ్బరి తోటల పునరుద్ధరణ పథకాన్ని అర్హులైన రైతులను గుర్తించి పథక ప్రయోజనాలు లబ్ధిని చేకూర్చుతూ రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. రానున్న ఏడాది కొరకు కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతు ఉత్పత్తి దారుల సంఘాల ద్వారా కొబ్బరి తోటలో పునరుద్ధరణ సంబంధిత ప్రతిపాదనలు రూపొందించి కొబ్బరి అభివృద్ధి బోర్డు నుంచి మరిన్ని నిధులు జిల్లాకు కేటా యించేలా తద్వారా ముదురు తోట్ల పునరు ద్ధరణ పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.ఈ బృందం అమలాపురం మండలంలో ఇందుపల్లి గ్రామం, అంబాజీపేట మండలంలో వాకల గరువు, గంగలకుర్రు, పుల్లేటికుర్రు గ్రామాలలో అయినవిల్లి మండలంలో మాగం, క్రాప గ్రామాలలో ముమ్మిడివరం మండలంలోని లంక అఫ్ ఠాణే లంక గ్రామాలను యాదృచ్ఛికంగా తనిఖీ నిర్వహిం చారన్నారు. జిల్లా వ్యాప్తంగా 1000 హెక్టార్లలో కొబ్బరి తోటల పునరు ద్ధరణకు నిధులు మం జూరు కాగా స్థానికంగా ఉన్న జనరల్ కేటగిరీ లో 860 హెక్టార్లలో తోటలు పునరుద్ధరణకు అర్హుల ను గుర్తించడం జరిగిందన్నారు. ఒక్కొక్క హెక్టార్కు రెండు సంవత్సరాల పాటు మొక్కల పెంపకా నికి ఈ పునరుద్ధరణ పథకం ద్వారా రూ.53,500 అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ, జిల్లా వ్యవసాయ అధికారి, కాకి నాగేశ్వర రావు, జిల్లా పట్టు పరిశ్ర మ అధికారి బి. గీతారాణి, సీనియర్ శాస్త్రవేత్త ప్లాంటేషన్ పాథాలజీ, ఉద్యాన పరిశోధన స్థానం డాక్టర్ వి.గోవర్ధన్‌రావు, హెచ్ఎస్. ఫీల్డ్ డెవలప్మెంట్ అధికారి కొబ్బరి అభివృద్ధి బోర్డు విజ యవాడ, శ్రీ శరత్ ఉద్యాన అధికారి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మృతదేహం వెలికితీత.. పోస్టుమార్టం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు బుధవారం మృతదేహాన్ని వెలికితీసి, పోస్టుమార్టం నిర్వహించారు. మండలంలోని మూలపేట గ్రామం ప్రకాష్ నగర్‌కు చెందిన వివాహిత గింజల బాల (25) రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో ఉరి వేసుకుని మృతి చెందింది. మృతదేహానికి వెంటనే అత్యక్రియలు నిర్వహించేశారు. ఈ నేపథ్యంలోనే మృతిరాలి తల్లి గింజల లక్ష్మి తన కుమార్తెను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించి అత్యక్రియలు నిర్వహిం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం తహశీల్దార్ చిన్నారావు, ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో సిబ్బంది భూమిలో కప్పిట్టేసిన మృత దేహాన్ని వెలికితీశారు. అక్కడే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. వైద్యులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఇల్లు దహనం కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - రౌతులపూడి

ములగపూడిలో తాటాకిల్లు దహనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. బాధితుని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా బాధితుడు నీలి చిన్నబ్బాయికి, అదే గ్రామానికి చెందిన ఇంధన బాబ్జి, పారుపాక గ్రామానికి చెందిన కల్లేపల్లి రాజుకు మధ్య సెల్‌ఫోన్ కోసం ఘర్షణ జరిగింది. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో వారిద్దరూ కలిసి తాటాకు ఇంటిని దహనం చేసినట్లు తమ విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. వారిద్దరినీ తుని కోర్టులో బుధవారం ప్రవేశపెట్టగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

గడ్డి మేటు దగ్ధం

ప్రజాశక్తి - కరప

కరప శివారు పేపకాయలపాలెంలో మంగళవారం రాత్రి 11:30 సమయంలో 100 ఎకరాల పంటకు చెందిన గడ్డి మేటు దహనం అయింది. ఈ సంఘటనకు సంబంధించి గడ్డి మేటు రైతు సలాది శ్రీనుబాబు మాట్లాడుతూ తాను గడ్డి వ్యాపారం చేస్తానని, గడ్డి నిల్వ పెట్టుకునికాకినాడ మార్కెట్లో అమ్మకం చేస్తుంటానని తెలిపారు. సుమారు 100 ఎకరాల పంటకు సంబంధించిన గడ్డిని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతుల నుంచి కొనుగోలు చేసుకుని నిల్వ చేసినట్లు తెలిపారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారే మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం అందించారని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందని, మొత్తం గడ్డి దహనం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని జనసేన నాయకుడు భోగిరెడ్డి గంగాధర్ కోరారు.

మెట్లపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చేబ్రోలులో ప్రమాదవ శాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి శిరసపల్లి ఈశ్వరరావు (40) ఇంటి మేడపై నుంచి మెట్లు దిగుతూ ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. భార్య సిరసపల్లి సత్యవతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం షాప్ సీజ్

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలో పెద్దాడ గ్రామంలో నంబర్ 0435015 రేషన్ షాపులో బియ్యం గల్లంతుపై కేసు నమోదు చేసినట్లు మండల సివిల్ సప్లయి అధికారి కమల కుమారి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ. పెద్దాడ గ్రామానికి చెందిన బక్కి రవికుమార్ రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించగా 60 బస్తాల రేషన్ బియ్యం గల్లంతు జరిగిందన్నారు. రేషన్ షాపును సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల జాతీయ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలపాలయ్యారు. కాకినాడ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకులను ఎదురుగా వస్తున్న బొలెరో వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన పసల వెంకటేష్, ప్రసాద్‌లుగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.సత్యనారాయణ తెలిపారు.

వేటకు వెళ్లి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

వేటకు వెళ్లిన వ్యక్తి మృతి చెందాడు. దీనిపై బుధవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గోగన్నమఠం పల్లిపాలెంకు చెందిన పసింగు బ్రహ్మయ్య (49) ఈనెల 21న సాయంత్రం తన ఇంటి వద్ద నుంచి డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న చెరువులో వేటకు వెళ్లాడు. అయితే అతను చెరువులో వేటాడుతూ ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొనిచనిపోయాడు. దీనిపై మతుని కుమా రుడు పేసింగు గణేష్ ఫిర్యాదు మేరకు బుధవారం నగరం ఎఎస్ఐ పి.కృష్ణ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా పంట కాలువలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యయ్యింది. సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వ్యకి మృత దేహంపై నిక్కరు మాత్రమే ఉంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి మార్చురీలో భద్రపరిచారు. రాజోలు విఆర్ఒ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుని ఆచూకి తెలిసిన వారు తమకు తెలియచేయాలని రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్ తెలిపారు.


శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డిఇఒ

విద్యార్థుల స్థాయి ఆధారంగా బోధన చేయాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

విద్యార్థుల స్థాయి ఆధారంగా విద్యాబోధన చేసినప్పుడే విద్యార్థుల అభ్యసనా స్థాయి పెరుగుతుందని డిఇఒ డాక్టర్ షేక్ సలీం బాషా పిలుపునిచ్చారు. మండలంలోని చెయ్యేరులో శ్రీనివాస ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ నందు జరుగుతున్న ఎనిమిదవ దశ ఎఫ్ఎల్ఎన్ ట్రయినింగ్ సెంటర్‌ను ఆయన బుధవారం సందర్శించారు. డిఇఒ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఒకటవ తరగతి విద్య పునాదిగా ఉంటుందని, విద్యార్థికి భాష, గణితంలో అవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఓర్పు, సహనం ఆభరణాలుగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశా లలపై సమాజంలో నమ్మకం కలిగించేలా బోధన చేయాలన్నారు.అప్పుడే ప్రాథమిక పాఠశాలలు పూర్వ వైభవాన్ని పొందుతాయన్నారు. ప్రస్తుతం ఉన్న ఎన్‌రోల్‌మెంట్ ఆందోళనకరంగా ఉందన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు అవగాహన చేసుకుని, వచ్చే విద్యా సంవత్సరానికి ముందే ఎన్‌రోల్‌మెంట్‌కు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిం చాలన్నారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణను సద్వినియోగం చేసుకుని, విద్యార్థుల అభ్యసనా స్థాయి పెరిగే విధంగా బోధన చేపట్టాలన్నారు. శిక్షణ సెంటర్ నిర్వహిస్తున్న తీరును కోఆర్డినేటర్ పి.రాంబాబు డిఇఒకు వివరించారు. జిల్లాకు చెందిన 360 మంది ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. అకడమిక్ పరంగా ఉపాధ్యా యులకు అందుతున్న కంటెంట్‌పై కెఆర్‌పిలు, డిఆర్‌పిలను డిఇఒ అడిగి తెలుసు కున్నారు. సమావేశంలో డైట్ లెక్చరర్ కళావతి, ఎంఇఒలు వైవి.సత్యనారాయణ, ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ జీవన్ కుమార్, కీ రిసోర్స్ పర్సన్స్ మామిడి శెట్టి రాంబాబు అంకం చంద్ర సూర్యం, డిఆర్‌పిలు పాల్గొన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - అమలాపురం


ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ శాఖ బుధవారం డిఆర్‌ఒకు విన్నవించారు. 12వ పిఆర్సి కమిషన్‌ను తక్షణమే పునరుద్ధరించాలని, ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని, 2003 డిఎస్‌సి వారికి మెమో 57 ప్రకారం పాత పెన్షన్ ను అమలు చేయాలని, అమలాపురం పరిధిలో గల వివిధ పాఠశాలలకు16 శాతం హెచ్ఆర్ఎ వర్తింప చేయాలని సమర్పించిన ఫైల్ వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా యుటిఎఫ్ శాఖ కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్‌ఒకు విజ్ఞాపన పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పి. వెంకటేశ్వరరావు, అధ్యక్షులు సురేంద్ర, సహాధ్యక్షులు జివి.రమణ, శ్రీనివాసరావు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


వాలంటీర్లకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపిడిఒ రాజు

'ఉల్లాస్'పై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఆలమూరు

యుఎల్ఎల్ఎఎస్‌పై మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఐ.రాజు ఆధ్వర్యంలో ఉల్లాస్ కు చెందిన వాలంటీర్లకు బుధవారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపిడిఒ రాజు మాట్లాడుతూ వయోజనులకు విద్యపై వాలంటీర్లకు పూర్తి అవగాహన కలిగించారు. గత ఏడాది నవంబర్ 6 నుంచి ఈ ఏడాది మార్చి 15 వరకు వయోజనులకు వాలంటీర్లంతా శిక్షణా తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం స్టడీ మెటీరియల్ వాలంటీర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి విజయభాస్కర్, ఎపిఎం ఎం.ధనరాజు, అకౌంటెంట్ కుమార్, వివోఏలు వాలంటీర్లు పాల్గొన్నారు.


ఆధార్ నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - అయినవిల్లి

ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వి ని యోగంచేసుకోవాలని సర్పంచ్ వార జయసావిత్రి అన్నారు. బుధవారం సర్పంచ్ మాట్లాడుతూ తొత్తరమూడి సచివాలయం వద్ద ఆధార్ క్యాంప్‌లో చిన్నపిల్లల ఆధార నమోదు పేరు మార్పులు చేర్పులు సరిచేసుకోవచ్చన్నారు. పంచాయతీ కార్యదర్శి గరిమెళ్ళ రవి మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిచే చిన్నపిల్లల తల్లిదండ్రులకు సమాచారం అందించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

పశువులకు ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

అప్పన్న రాముని లంక గ్రామంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువులకు ఉచిత వైద పరీక్షలు బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు వైద్య శిబిరాల ద్వారా పశువులకు వచ్చే వ్యాధులను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీను, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వెంకటేశ్వర రావు, పశు వైద్యాధికారి సునీల్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకర్ల కమిటీ సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషన్ అధ్యక్షతన బుధవారం అమలాపురం పరిధిలో ఉన్న బ్యాంక్ మేనేజర్లతో పట్టణ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశం లో సిటీ మిషన్ మేనేజర్ మోహన్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంక్ లోన్లు గురించి, పిఎం స్వనిధి, కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అలాగే ఎల్‌డిఎం మాట్లాడుతూ ఎస్‌సి, బిసి కార్పొరేషన్ లోన్లు గురించి, టి డ్కో రికవరీ గురించి వివరించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ కేశవవర్మ, సిటీ మిషన్ మేనేజర్ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ముమ్మిడివరం: నగర పంచాయతీ కార్యాలయం ఆవరణలో మెప్మా సంస్థ ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ ను బుధవారం కమిషనర్ రవివర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన తిను బండారాలు, జూట్ బాగ్స్, ఫ్లవర్ వాజ్, కొవ్వొతులు, పేపర్ ప్లేట్లు, హల్దీ జ్యూవెలరీ, ఆర్గానిక్ ప్రొడక్ట్స్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాల స్టాల్స్ లోని వస్తువులు విశేషంగా ఆకట్టుకున్నాయి.. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్, సిఒ రాజేశ్వరి, ఆర్‌పిలు, ఎఇ పివి.సుధాకర్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యూనియన్ నాయకుడు తాతారావు మృతి

ప్రజాశక్తి - మండపేట

పట్టణ తోపుడు బండ్ల యూనియన్ నాయకుడు బెవర తాతారావు (73) గుండెపోటుతో మంగళవారం రాత్రి మరణించారు. స్థానిక రావులపేటలో నివాసముంటున్న ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. టిడిపి ఆవిర్భావం నుంచి ఈయన పార్టీకి వీరవిధేయుడు. పట్టణంలో తోపుడు బండ్ల యూనియన్ స్థాపించి మూడు పర్యాయాలు సంఘానికి అధ్యక్షునిగా పనిచేశారు. ఈయన మతికి తోపుడు బండ్ల సంఘం, పలువురు టిడిపి నాయకులు తమ సంతాపాన్ని తెలిపారు.

100 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అచ్చియ్యపాలెం శివారున సారా బట్టీపై దాడి చేసి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 100 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు హెచ్‌సి లక్ష్మణరావు తెలిపారు. ఈ కేసులో అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన కుక్క వెంకటరమణను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఆయన తెలిపారు.

కడియంలో వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - కడియం

కొవ్వూరు, రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల్లో వరుసగా గొలుసు చోరీలకు పాల్పడ్డ బైకు దొంగలను పట్టుకునేందుకు జాతీయ రహదారిపై పోలీసులు జల్లెడ పట్టారు. బుధవారం ఇద్దరు యువకులు బైకుపై వచ్చి మహిళల మెడలో చైన్లను దొంగలించుకు పోవడంతో పోలీస్ యంత్రాంగం అప్రమత్తం అయ్యింది. వేమగిరి జంక్షన్‌లో సిఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ దుర్గాప్రసాద్ ఇతర పోలీసు సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు.

పోక్సో కేసులో ఉపాధ్యాయునికి జైలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయుడు డి.గోపాలకృష్ణమూర్తిపై పోక్సో కేసు రుజువు కావడంతో ఏలూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి రెండేళ్ల ఆరు నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఉండ్రాజవరం ఎస్ఐ జి.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మాగాపు మహాలక్ష్మి 2020లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ అవినాష్ కేసు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

వెల్ల ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల పరిశీలన

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వెల్ల గ్రామంలో గల ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తులను డివిజినల్ వైద్యాధికారి డాక్టర్ ఎన్.ప్రశాంతి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలను పరిశీలించి ఆమె తగు సూచనలు చేశారు. అనంతరం వెల్ల గ్రామంలో లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆశా వర్కర్లు, ఎఎన్ఎం లతో ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ సర్వేలో కుష్టు వ్యాధి చిహ్నాలు, లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించవచ్చునని ఆమె తెలిపారు. రామచంద్రపురం డివిజన్లో గల 17 పిహెచ్‌సి, యుపిహెచ్‌సిలలో ప్రస్తుతం 20 మందికి చికిత్స అందిస్తున్నామని వివరించారు. చర్మంపై రాగి రంగు మచ్చలు, నరాల నొప్పి, కాళ్ల చేతులలో కండరాల బలహీనత, చేతులు పాదాలు తిమ్మిరిగా ఉండుట, కళ్ళు పూర్తిగా మూసుకొన లేకపోవుట వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీప్రసన్న సూపర్వైజర్ జి కమల్ శేషు, సూపర్వైజర్లు కే శ్రీనివాస్, డిరాజేశ్వరి ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - పి.గన్నవరం


ఫిర్యాదుల స్వీకరిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి

విజయవాడ మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జన వాణి- జనసేన భరోసా కార్యక్రమంలో బుధవారం పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణమే ఫిర్యాదులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కమల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాజకీయ, సామాజిక రంగాలలో మెండి కమల చేస్తున్న సేవలు అభినందనీయమని శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ పరిధికి చెందిన కమల చేస్తున్న సేవలకు గుర్తింపుగా జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశామని డాక్టర్ ప్రసాద్ అన్నారు. శ్రీశ్రీ కళావేదిక, వరల్డ్ రైటర్స్ ఫారం, వరల్డ్ పొయెట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో కమల కు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అంతర్జాతీయ సాహిత్య సేవా సంస్థ సిఇఒ డాక్టర్ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మహాకవి బోయి భీమన్న సతీమణి బోయి హైమావతి, బోళ్ల సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే కంప్యూటర్ పరిజ్ఞానం సాధించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

విద్యార్థి దశలోనే కంప్యూటర్ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. కొత్తూరు సెంటర్ ప్రభుత్వ హైస్కూల్‌లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ అధినేత కృష్ణ పాడిశెట్టి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాసరావు, నియోజకవర్గ టిడిపి యువ నేత బండారు సంజీవ్ లతో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందిస్తూ రాష్ట్రం మొత్తం జరగనున్న ఈ కార్యక్రమం మొదటగా ఆలమూరు నుంచి ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ..రాజు, ఎంఇఒ బి.అప్పాజీ, మండల డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, సర్పంచులు సంగీత సుభాష్, తోట భవాని వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీను, కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

బాలల పరిరక్షణ కొరకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ ఛైర్మన్ జి.శ్రీదేవి అన్నారు. రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఐసిడియస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సిడిపిఒ వివి.వరాహలక్ష్మి అధ్యక్షతన, కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి మున్సిపల్ ఛైర్మన్ జి.శ్రీదేవి మాట్లాడుతూ కిశోర వికాసం ద్వారా వార్డు స్థాయి లో బాలలతో గ్రూపు లు ఏర్పాటు చేసి వారికి బాలల చట్టాలు పరిరక్షణ అంశాలు, వ్యక్తి గత పరిశుభ్రత పై అవగాహన కల్పిస్తారన్నారు. కమిషనర్ విఐపి ఐ.నాయుడు మాట్లాడుతూ నేటిసమాజంలో బాలలను కాపాడవలసిన బాధ్యత అందరిపైనా ఉందని తెలియజేశారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కిశోర వికాసంపై, బాల్య వివాహాలు, పోక్సో చట్టంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఛైల్డ్ హెల్ప్ లైన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ డి.సుధీర్, డాక్టర్ రెడ్డి, మండల విద్యాశాఖాధికారి వి.నాగేశ్వరి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు కె.నాగమణి, యమ్.పార్వతి, ఐ.కళ్యాణి, జి సూర్యవతి, సచివాలయం వెల్ఫేర్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

రీ సర్వే పై ఆర్‌డిఒ సమీక్ష

ప్రజాశక్తి - రావులపాలెం

రీ సర్వేపై ఆర్‌డిఒ శ్రీకర్ స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధి పొడగట్లపల్లిలో నిర్వహిస్తున్న రీసర్వే విధివిధానాలపై మాట్లాడారు. రీ సర్వే పారదర్శకంగా వేగవంతం చేయాలని ఆర్‌డిఒ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట డిఐఎస్ఒ, తహశీల్దార్ బిఎం.ముక్తేశ్వరరావు, మండలర సర్వేయర్లు, సర్వే డిటి, విఆర్ఒలు, విలేజ్ సర్వేయర్ లు పాల్గొన్నారు.